సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 20 ఏండ్ల నుంచి సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయకపోవడం సబబు కాదని పేర్కొన్నారు. విద్యాశాఖలో కొన్ని విభాగాల్లోని టీచింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేసినప్పటికీ ఈ ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం అన్యాయమని తెలిపారు. 22 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, అప్పటివరకు కనీస వేతన స్కేలును తక్షణం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ. ఐదు లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. విద్యా శాఖ నియామకాల్లో 30 శాతం వెయిటేజి కల్పించాలని విన్నవించారు. వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో తగు నిర్ణయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు జూలకంటి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు లేఖ రాశారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు స్వయంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా అమలు కావట్లేదనీ, వాటికోసం వారు సమ్మె బాట పట్టారని వివరించారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, సమ్మె విరమింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. గతనెలలో మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్‌వాడీ సంఘాలతో చర్చించి, నిర్దిష్ట హామీలు ఇచ్చారనీ, దానికి భిన్నంగా అతి తక్కువ బెనిఫిట్స్ ప్రకటించారని వివరించారు. ప్రధానమైన వేతనాల పెంపు, ఇతర సమస్యలపై అసలు ఏమాత్రం స్పందించలేదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు, రిటైర్మెంట్ వయసు 60 ఏండ్లు, హెల్పర్లకు ప్రమోషన్లు, 2017 నుంచి టిఏ, డిఏ, ఇంక్రిమెంట్లు, ఇంచార్జి అలవెన్సు బకాయిలు ఇప్పించాలని కోరారు.

కాంగీ'రేసు'లో గోలగోల

- విజయభేరి సన్నాహక సభలో వివాదం
- ఆధిపత్యానికి ఆయా గ్రూపుల ఆరాటం
- పరస్పర కామెంట్లతో అతలాకుతలం
- బయటకు వెళ్లిన భట్టి
- సముదాయించిన పొంగులేటి
- తీరుమారని కాంగ్రెస్ నేతలపై అభిమానుల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఖమ్మం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే ఖమ్మం' అనే రీతిలో గత రెండు శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫలితాలు వచ్చాయి. అధికార బిఆర్ఎస్ ఈసారి ఎలాగైనా మెరుగైన ఫలితాలు సాధించాలనే పట్టుదలతో ఉంటే.. దానికి ఊతమిచ్చే పరిస్థితులు కాంగ్రెస్‌లో నెలకొన్నాయి. ఖమ్మం మాజీ ఎంపి, టిపిసిసి ఎన్నికల ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరికతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగినా.. ఆ పార్టీకి అంతర్గత వర్గ పోరు చేటు తెచ్చేలా ఉంది. ఏ సమావేశమైనా కుమ్ములాటలు.. వర్గపోరుతో అట్టుడికే కాంగ్రెస్ నేతల తీరుపై ఆ పార్టీ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో నిర్వహించే విజయభేరి సభ విజయవంతం కోసం ఖమ్మం డీసీసీ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. ఆధిపత్య పోరుతో అతలాకుతలం అయింది.

ఆధిపత్యం కోసం ఆరాటం.. గ్రూపు విభేదాలతో కామెంట్లు..

ఖమ్మంలో రాహుల్‌గాంధీ హాజరైన ప్రజాగర్జన సభను సక్సెస్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు సోనియాగాంధీ, కాంగ్రెస్ అధినాయకత్వం పాల్గొనే విజయభేరి సన్నాహక సమావేశంలో మాత్రం గ్రూపు విభేదాలతో గోలగోల చేశారు. ఎఐసిసి నుంచి ఖమ్మం పార్లమెంట్ పరిశీలకులుగా వచ్చిన మహ్మద్ నజీమ్‌ఖాన్ సమక్షంలోనే మాటల యుద్ధానికి దిగారు. సమావేశం ప్రారంభం కాగానే 'రాయలదే పాలేరు' అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోరులో ఓడిన రాయల నాగేశ్వరరావు అభిమానులు నినాదాలు చేశారు. వారిని వారించే లోపే.. భట్టి సీఎం అంటూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అనుచరులు స్లోగన్స్ ఇచ్చారు. ఇంతలో రేణుకాచౌదరి అనుచరులు.. రేణుకాచౌదరి జిందాబాద్.. రేణుకా సీఎం అంటూ నినదించారు. మరోవైపు నుంచి పోట్ల నాగేశ్వరరావు అనుచరులు.. బీసీలకు అన్యాయం.. జనరల్ సీట్లలో ఒకటైనా ఇవ్వాలని నినాదాలు చేశారు.

పోట్ల బీసీ కానప్పటికీ ఆయన అనుచరులు ఈ రకమైన నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. సంప్రదాయంగా బీసీలకు ఇస్తున్న కొత్తగూడెం స్థానం నుంచి పొంగులేటి బరిలో నిలుస్తారనే ప్రచారం సాగుతోంది. పొంగులేటి పోటీ చేస్తే పోట్లకు టిక్కెట్ రాదు కాబట్టి వ్యూహాత్మకంగా మాజీ ఎమ్మెల్సీ అనుచరులు ఈ రకంగా వ్యవహరించినట్టు చర్చ సాగింది.

భట్టి బయటకు.. పొంగులేటి సముదాయింపు

కార్యకర్తలను సముదాయించి సమావేశం సజావుగా సాగేలా చూడాల్సిన సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క జూమ్ మీటింగ్ పేరుతో అర్థంతరంగా బయటకు వెళ్లిపోయారు. వెంటనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి మైక్ తీసుకుని "టిక్కెట్ల విషయంలో ఎఐసిసిదే తుది నిర్ణయం.. ఎవరికి టిక్కెట్లు ఇచ్చినా గెలిపించుకోవాలి. ఇది సోనియాగాంధీ రాక సందర్భంగా ఏర్పాటు చేసిన విజయభేరి సభ సన్నాహక సమావేశం.. ఇటువంటి సమావేశంలో మనం ఇలా గోల చేయడం కరెక్టు కాదు' అని సముదాయించారు.

ఈసారి రేణుకా అనుచరుల వంతు

ఆ తర్వాత ఎఐసిసి పరిశీలకునితో పాటు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్.. ఇలా ఒకరి తర్వాత మరొకరు మాట్లాడారు. ఈ క్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు మాట్లాడుతుండగా.. రేణుకా అనుచరులు అడ్డుకొని.. జిల్లాపై ఈయన పెత్తనం ఏంటి అంటూ కేకలు వేశారు. అంతలోనే మరికొందరు 'అమ్ముడుబోయమంటూ..' రేణుకాచౌదరిని ఉద్దేశించి కామెంట్స్ చేశారు.

మరోవైపు 'వెనుక వచ్చిన వాళ్లకు ప్రాధాన్యత ఏంటి' అంటూ పొంగులేటిని ఉద్దేశించి మరికొందరు మాట్లాడారు. 'కలిసికట్టుగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని.. విజయభేరి సభను విజయవంతం చేయాలని' చెప్పాల్సిన విషయాన్ని చెప్పి పొంగులేటి కూడా సమావేశం నుంచి నిష్క్రమించారు. మొత్తమ్మీద జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న ఈ వివాదం అధికారపార్టీలో ఫుల్‌జోష్‌ను నింపింది. పార్టీ అభిమానులు మాత్రం నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. అందరూ వెళ్లాక కొంతసేపటికి సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు జరిగిన గలాట గురించి మాటమాత్రమైనా ప్రస్తావించకుండా విజయభేరి సభపై ప్రసంగించి ముగించారు. విలేకరుల అడిగిన ప్రశ్నలకు కూడా దాటవేత సమాధానాలు చెప్పుకొచ్చారు.

ప్రస్తుతానికి ఇక్కడే...

- ప్రస్తుతానికి ఇక్కడే...రాష్ట్ర రాజకీయాలపైనే ముఖ్యమంత్రి దృష్టి!
- కెసిఆర్‌కు దూరమవుతున్న 'ప్రాంతీయ' నేతలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌తో దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తెస్తానని చెప్పి కొంతకాలం హడావిడి చేసిన తెలంగాణ సిఎం, బిఆర్ఎస్ అధ్యక్షులు కెసిఆర్ ఇప్పుడు సొంత ఇంటిని చక్క బెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. జాతీయ రాజకీయాలపై దృష్టి పెడితే రాష్ట్రంలో ఆగమవుతామని గ్రహించి ఈ ఎన్నికల వరకు తెలంగాణపైనే ఫోకస్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించి బాధ్యులను కూడా ప్రకటించిన ఆయన గత కొంతకాలంగా ఆ కార్యాచరణ ఆపేశారు. రాష్ట్రంలో మళ్లీ అధికారం నిలబెట్టుకున్నాక జాతీయ రాజకీయాలపై ఫోకస్ పెట్టొచ్చని కెసిఆర్ భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన... ప్రత్యర్థి పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. కేంద్రంలో కాంగ్రెస్సేతర, బిజెపియేతర ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు దిశగా 2017, 2018లోనే కెసిఆర్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ పలు ప్రాంతీయ పార్టీలతో ఈ కూటమి దిశగా చర్చలు సాగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి మళ్లీ విజయం సాధించడంతో కొన్నాళ్లు సైలెంట్ అయ్యారు. జాతీయ స్థాయిలో తెలంగాణ మోడల్‌కు ఆదరణ ఉందని చెప్తూ టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా 2022 అక్టోబర్‌లో మార్పుచేసి జాతీయ రాజకీయాల్లో అడుగు పెడుతున్నట్టు ప్రకటించారు. పార్టీ పేరు మార్పు సమయంలో కెసిఆర్ వెన్నంటే ఉన్న కర్ణాటక మాజీ సిఎం కుమారస్వామి సహా మిగతా నాయకులందరూ ఆ తర్వాత దూరం జరిగారు. కొన్ని రోజుల కిందటి వరకు కెసిఆర్‌తో కనిపించిన రైతు సంఘాల నాయకులు కూడా ఇప్పుడు కనిపించడం లేదు. రాష్ట్ర అసెంబ్లీకి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నెల 19 నుంచి నిర్వహించే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో జమిలి ఎన్నికలపై చర్చ జరగొచ్చని, అయితే, ఈ అసెంబ్లీ ఎన్నికల సమయానికే జమిలి ఎన్నికలు అమల్లోకి రాకపోవచ్చని ప్రగతి భవన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా కెసిఆర్ వ్యూహాలు రూపొందిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ టికెట్లు ఇచ్చిన అభ్యర్థుల నియోజకవర్గాల్లో సర్వేలు చేయించడం, ఎక్కడ ఏ పార్టీ ప్రభావం ఏ మేరకు ఉంది? ఎక్కడ ఎవరికి గెలిచే అవకాశాలున్నాయి? వ్యక్తిగతంగా ఓట్లు సాధించే లీడర్లెవరు? ఇతర పార్టీల ప్రభావంపై సర్వే చేయిస్తున్నటు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్‌ను కెసిఆర్ నియమించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ ఉద్యమించబోతున్నట్టు ప్రకటించి.. ఆ తర్వాత చల్లబడ్డారు. వైజాగ్, విజయవాడ, తిరుపతి, కర్నూలులో భారీ బహిరంగ సభలు ఉంటాయని బిఆర్ఎస్ హైకమాండ్ నుంచే స్వయంగా లీకులు ఇచ్చినా.. ఆ తర్వాత చడీచప్పుడు లేదు. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో కెసిఆర్ బహిరంగ సభ ఉంటుందని ప్రచారం జరిగినా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. మహారాష్ట్రలో పార్టీ కార్యకలాపాలు తగ్గించేశారు. అక్కడ మొత్తం పార్టీ విస్తరణ ఇప్పటికిప్పుడే సాధ్యం కాకపోవచ్చని, సరిహద్దు నియోజకవర్గాల్లో ఇక్కడి సంక్షేమ పథకాల ప్రభావం ఉంటుందని, ఆయా ప్రాంతాలపైనే దృష్టి సారించాలనే ఆలోచనలో కెసిఆర్ ఉన్నట్టు సమాచారం.

కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

103 మంది విద్యార్థులకు అస్వస్థత • ఈ ఏడాదిలో రెండుసార్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ కేంద్రంలోని కుప్పల్ రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 103 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారికి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కెజిబివి పాఠశాలలో 272 మంది విద్యార్థినులు ఉండగా, ఎప్పటిలాగే సోమవారం రాత్రి 7 గంటలకు భోజనం చేసి పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో 103 మంది విద్యార్థులు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురికాగా పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సమాచారం అందించగా.. వారు హాస్టల్‌కి వచ్చి విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం విద్యార్థులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆస్పత్రికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ ఘటనపై మంగళవారం ఉదయం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రమేష్, డిఇఒ దుర్గాప్రసాద్, ఎంపిడిఒ రాజేశ్వర్, తహశీల్దార్ వెంకటరమణ, ఎంఈఓ స్వామి, డిప్యూటీ తహశీల్దార్, రాజశేఖర్, ఎస్ఐ హరిబాబు.. కస్తూర్బా పాఠశాలకు చేరుకొని పాఠశాల పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు. భోజన నిర్వాహకులను విచారించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భయాందోళనతో పాఠశాలకు చేరుకోగా.. కోలుకున్న విద్యార్థులను వారితో ఇండ్లకు పంపించారు. కాగా, ఇదే పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణ కేంద్రానికి సుదూరాన ఉన్న ఈ పాఠశాలకు రెగ్యులర్ ప్రత్యేక అధికారి లేకపోగా, ఇన్‌ఛార్జి అధికారి పట్టించుకోకపోవడంతో పాటు పై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల క్రితం రెగ్యులర్ ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పజెప్పినా ఇప్పటికి చార్జ్ తీసుకోకపోవడం వీరి అలసత్వానికి నిదర్శనం.

మెనూలో మార్పే కారణమా..?

విద్యార్థులకు ప్రతిరోజూ అందించే మెనూలో మార్పు వల్లే ఘటన జరిగినట్టు అధికారులు తెలిపినట్టు సమాచారం. సోమవారం ఉదయం అల్పాహారంలో చింతపండు రసం, మధ్యాహ్నం బీరకాయ, కోడిగుడ్డు పెట్టారు. మెనూలో సోమవారం గుడ్డు లేకున్నా గుడ్డు పెట్టడంతో ఉదయం పెట్టిన అల్పాహారంతో ఫుడ్ పాయిజన్ అయినట్టు నిర్ధారణకు వచ్చారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT ANEKAL
O.S. No.449/2021

BETWEEN: C.N. Prakash ... PLAINTIFF

AND: Sri Rayachoti Jagannath Rao and another ... **DEFENDANTS**

SUMMONS/NOTICE TO DEFENDANT No. 2

2. Smt. Rayachoti Nirmala, W/o Rayachoti Jagannath Rao, aged about 63 years, No.1-10-72/D, Chikoti Garden, Begum Pet, Hyderbad- 500016.

WHEREAS the plaintiff has filed the above case U/o VII Rule 1 of CPC, against you and other defendants for the relief of specific Performance of sale Agreement dated 12-08-2011 and other reliefs against you.

WHEREFORE this summons/notice to the defendant No.2 namely Smt. Rayachoti Nirmala is published directing to appear before the PRINCIPAL SENIOR CIVIL JUDGE AT ANEKAL on **20-11-2023** at 11:00A.M. to answer the suit. If you fail to appear before this Court on that day either in person or through your counsel, you will be placed ex-parte and the case will be disposed off in accordance with

Given under my hand and seal of the Court, this notice is issued on 28-08-2023 under my signature

By the order of the Court, Chief Ministerial Officer, Senior Civil judge & JMFC Court at Anekal.

Address of the Advocate:
Sri. Naveen Gudikore S,
M/s RMN Legal, Advocates,
Office at No.22, 1st Cross,
Madhavanagara,
Bengaluru- 560001.

గోడలపై రాజకీయం

కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల వాల్ పోస్టర్ల వార్

వాటర్ పెయింట్‌లపై గులాబీ రంగులు

ఎన్నికలకు ముందే హోరాహోరీ ప్రచారం

తమ పెయింటింగ్‌లను అధికార పార్టీ చెరిపేయిస్తుందని కాంగ్రెస్ ఆరోపణ

సోషల్ మీడియాపైనే ప్రధాన పార్టీల దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య వాల్‌పోస్టర్ల వార్ మొదలైంది. ఇరుపార్టీలు పోటాపోటీగా వాల్‌రైటింగ్స్ ప్రచారం మొదలుపెట్టాయి. విచ్చలవిడిగా స్టిక్కింగ్ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఎన్నికలకు ముందు నుంచే ఇరుపార్టీలు హోరా హోరీగా ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. గోడలపై ఉన్న కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను చెరిపి వేసి 'గులాబీ' రంగులను పులుముతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది మూడు రంగులను తొలగించి వెళ్లగానే అదేస్థానంలో మంత్రి పువ్వాడ అజయ్ పేరుతో ఫ్లెక్సీలను స్టిక్ చేస్తున్నారు. కానీ వీటి జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లకపోవడం గమనార్హం. నగరంలోని పలు డివిజన్‌లలో నాలుగైదు రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది.

రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మంలో చేసిన పలు అభివృద్ధి పనుల దృశ్యాలతో కూడిన స్టిక్కింగ్ ఫ్లెక్సీలను బిఆర్ఎస్ రూపొందించింది. 'మన ఖమ్మం.. మన అజయన్న' పేరుతో తయారు చేసిన ఈ పోస్టర్లను ఇటీవల అతికిస్తోంది. అభివృద్ధి పేరుతో రూపొందించిన ఈ ఫ్లెక్సీల జోలికి కార్పొరేషన్ సిబ్బంది వెళ్లడం లేదు. కాంగ్రెస్ వాటర్ పెయింట్‌లను మాత్రం తొలగిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. అభివృద్ధి దృశ్యాలు ఉన్నాయి కాబట్టి గులాబీ ఫ్లెక్సీలను తొలగించడం లేదని నగరపాలక సంస్థ సిబ్బంది చెబుతున్నారు. కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం దీన్ని తప్పుబడుతున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ నేతలపై మండిపడుతున్నారు.

పురపాలక మంత్రి మాటలు పెడచెవిన..

ఖమ్మంలోని 40, 42తో పాటు పలు డివిజన్లు, ఉమ్మడి జిల్లాలోని వివిధ మున్సిపాల్టీలు, పలు ప్రాంతాల్లో వేసిన కాంగ్రెస్ వాటర్ పెయింటింగ్స్‌ను తొలగించి, గులాబి వినయిల్ (ఫ్లెక్సీ స్టిక్కర్లు)ను వేస్తున్నారు. ఈ విషయమై ఆయా ప్రాంతాల్లో ఇరు గ్రూపుల మధ్య వివాదం నడుస్తోంది. పరస్పరం దూషించుకుంటున్నారు. అధికారం ఉందనే ఇలా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ విషయంలో నెలకొంటున్న కాలుష్యంపై పురపాలకమంత్రి కెటిఆర్ మాటలను కూడా కార్పొరేషన్ సిబ్బందితో పాటు బిఆర్ఎస్ శ్రేణులు పెడచెవిన పెడుతున్నాయని కాంగ్రెస్ కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ప్రచార సామగ్రికి భారీగా ఖర్చు

ప్రచార సామగ్రికి ఆయా పార్టీలు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. అభ్యర్థులు ఎవరికి వారుగా సోషల్ మీడియా నిర్వహణ కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. కొందరు ఏకంగా ఫ్లెక్సీ మిషన్‌లను సైతం కొనుగోలు చేసి, సిబ్బందిని ఏర్పాటు చేసుకుని ప్రింటింగ్ వేయిస్తున్నారు. ప్రధాన మీడియా కన్నా కూడా సోషల్ మీడియాపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, షేర్‌చాట్ రీల్స్ తయారు చేయించి మరీ చక్కర్లు కొట్టిస్తున్నారు. ప్రత్యర్థి వైఫల్యాలను ఎండగట్టే రీతిలో ఆసక్తికరమైన మీమ్స్‌ను సైతం రూపొందిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లోపాలపై విపక్షాలు దృష్టి సారిస్తుండగా.. విపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు విస్మరించిన అభివృద్ధి పనుల దృశ్యాలను నాడు- నేడుగా ప్రచారం చేస్తున్నారు. గడప గడపకు కాంగ్రెస్ రూపంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం చేసుకుంటున్నారు. అలాగే, ఈ తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిపై బిఆర్ఎస్ ప్రచారం నిర్వహిస్తోంది. ఇప్పటి నుంచే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలు పడుతున్న ప్రయాసాలపై జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

- అధికారుల బెదిరింపులు సరికాదు
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి.. నెల రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చినా సమస్యను పరిష్కరించకుండా అధికారులు బెదిరింపులకు పాల్పడటం.. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం ఏంటని" సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె మంగళవారం రెండో రోజూ కొనసాగింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీల సమ్మెకు తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, పాలడుగు భాస్కర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులు లేబర్ యాక్ట్ ప్రకారం నెల రోజుల ముందే ఐసిడిఎస్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారన్నారు. అయినా అంగన్వాడీలను అధికారులు బెదిరిస్తున్నారని, సమ్మెను భగ్నం చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ఐకెపి వివఎలకు, పంచాయతీ సెక్రెటరీలకు అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరి పని వారే చేయాలని, బిఆర్ఎస్ ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తోందని విమర్శించారు. పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ. 5లక్షలు చెల్లించాలని కోరారు. సమ్మె నోటీసులో తెలియజేసిన ఇతర డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరించాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్, చేవెళ్లలో సమ్మెకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరు ప్రాజెక్టు పరిధిలో రెండో రోజు కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నాయకులు పి.నాగమణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ను బెదిరించడం కాదు సమస్యను పరిష్కరించండని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, పినపాకలో సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులను సిడిపిఒ స్వాధీనం చేసుకున్నారు. ములకలపల్లి మండలం మాధారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొడుతున్న సిడిపిఒను సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. భద్రాచలంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు దీక్షను ప్రారంభించారు.

పోరాడితేనే తెలంగాణ వచ్చింది : మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజలు బెదిరించి, మెడలు వంచి కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లుతాయని హెచ్చరించాకే ఆ పార్టీ తెలంగాణ ఇచ్చిందని మంత్రి కెటిఆర్ తెలిపారు. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందంటే అన్యాయంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రగతి భవన్‌లో మంగళవారం ఆయన ప్రింట్ మీడియా రిపోర్టర్లతో చిట్‌చాట్ చేశారు. మూడోసారి సిఎం కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారనీ, బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందనీ, ప్రజలు స్పష్టతతోనే ఉన్నారనీ, ప్రతిపక్షాలే అయోమయంలో ఉన్నాయని తెలిపారు. వారికి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలియదనీ, అవి ఢిల్లీ బానిస పార్టీలంటూ విమర్శించారు. తెలంగాణకు మోడీ ఒక్క పైసా ఇవ్వకున్నా కాంగ్రెస్, బిజెపి పార్టీలు అడగవని విమర్శించారు. బిజెపి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జమిలీ ఎన్నికలంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బిజెపి అవగాహనలో ఉన్నాయనీ, అందుకే ఒకరినొకరు విమర్శించుకోరని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిణామాలు వారి తలనొప్పి అంటూ తమకెలాంటి సంబంధం లేదని వ్యాఖ్యానించారు.

జైలు శిక్ష అమలు నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మండలం మంచిరేవుల గ్రామంలోని విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ రత్నారెడ్డి, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ పి.సత్యబాబుకు గతంలో సింగిల్ జడ్జి విధించిన జైలు శిక్ష అమలును హైకోర్టు డివిజన్ బెంచ్ నిలిపేసింది. కోర్టుకు ఇచ్చిన హామీ తర్వాత నిర్మాణాలు చేశారంటూ మిర్చుమల్ చెల్లారాం మంఘ్నాని దాఖలు చేసిన కోర్టుధిక్కార కేసులో వారికి ఆరు నెలల జైలు, రూ.రెండు వేలు చొప్పున జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. అప్పీల్ కోసం తీర్పు అమలును పది రోజులు సస్పెన్షన్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో దాఖలు చేసిన అప్పీళ్లను ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే ఆధ్వర్యంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. కోర్టుకు హామీ ఇచ్చాక నిర్మాణాలు చేశారో లేదో తేల్చాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ వింగ్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. రెండు ఎకరాల లీజు భూమిలో నిర్మాణాలకు అనుమతులు లేకపోవడంతో నార్సింగ్ మున్సిపాల్టీ వాటిని పాక్షికంగానే కూల్చిందనీ, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ రత్నారెడ్డి నిర్మాణాలు చేశారని కోర్టు ధిక్కరణ పిటిషనర్ వాదన.

IN THE COURT OF THE CHIEF JUDGE CITY CIVIL COURTS AT :: HYDERABAD
E.P. No. 1043 of 2023

Between :
B. Bhikshapathi ... Decree Holder
AND
K. Balakrishna ... Judgment Debtor

To,
(Judgement Debtor)
K. Balakrishna, S/o. K. Lingaiah,
Aged about 35 years, Occ : Service,
R/o. H.No. 2-3-603/50/6/40/67,
Patel Nagar, Hyderabad - T.S.

NOTICE

Please take Notice that the above E.P. No. 1043 of 2023 filed by the Decree Holder for the relief to issue warrant of Arrest and detention in the civil prison as the Judgment Debtor has means to pay the awarded amount total Rs. 36,700 but is avoiding to pay the same under order 21, rule 37 and 38 of C.P.C., and further pay monthly insterest of Rs. 700/- per month may be granted till the realization of this E.P. is stand posted to **27-09-2023** at **10.30** am before the Honorable Chief Judge, City Civil Courts, at Hyderabad, for your appearance and disposal. Failing to appear on the said appointed day and time the matter would be proceeded as per law.

(By Order of the Honourable Court)

CHAND PASHA
Advocate
Off.:3-5-854/1, Behind Petrol Pump,
Hyderguda, Hyd.T.S.
Cell : 9246554205

చెరకు డబ్బులు ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదే

- పరిశ్రమను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొని ప్రారంభించాలి
- కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి
- రైతు సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చెరకు రైతుల మహాధర్నా

జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న చెరకు రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెరకు రైతులకు బకాయిపడ్డ డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి అన్నారు. చెరకు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రైతు సంఘాల జెఎసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. నియోజకవర్గంలోని రైతులు ట్రాక్టర్లలో చెరకు గడ్డెలతో ర్యాలీకి తరలి వచ్చారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, సామాజిక ఉద్యమకారులు ఢిల్లీ వసంత్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. రామచందర్, రైతు నాయకులు కొండల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పడిన మొట్టమొదటి శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎన్ఎస్ఎఫ్ చక్కెర పరిశ్రమలన్నింటినీ ఆంధ్ర పాలకులు కారుచౌకగా విక్రయించారని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటికీ పరిశ్రమలను వెనక్కి తీసుకోకపోగా ఆయా పరిశ్రమలకు చెరకు తరలించిన రైతులకు డబ్బులు ఇప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.

ప్రభుత్వ అండదండలతోనే పరిశ్రమల యజమానులు, వ్యాపారవేత్తలు రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. ట్రైడెంట్ పరిశ్రమ యాజ మాన్యానికి ప్రభుత్వ అండలు ఉన్నందుకే 150 ఎకరాల భూమిని క్రమంగా విక్రయిస్తూ వస్తుందని ఆరోపించారు. నిజాం కాలంలో ఏర్పడిన చక్కెర పరిశ్రమలపై నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, పరిశ్రమల్లో క్రషింగ్‌కు ముందు యాజమాన్యం, రైతులతో చర్చలు జరిపి మద్దతు ధరలు ప్రకటించి హార్వెస్టింగ్ చార్జీలు కూడా ప్రభుత్వమే భరించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు న్యాయం చేసిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా నాశనం చేస్తున్నదని విమర్శించారు.

నిజామాబాద్ జిల్లాలో నాడు 40 వేల ఎకరాల్లో సాగుచేసిన పసుపు పంట.. నేడు మద్దతు ధర లభించకపోవడంతో 15 వేల ఎకరాలకు పడి పోయిందన్నారు. ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో రైతులు ఉద్యమా లు చేసి జైళ్లకు సైతం వెళ్లారని గుర్తుచేశారు. చెరకు పరిశ్రమలు ఇండస్ట్రియల్ శాఖ పరిధిలోకి వస్తుంది కాబట్టి ప్రభుత్వం పూర్తిస్థాయిలో బాధ్యత వహించి తక్షణమే రైతులకు డబ్బులు ఇప్పించాలని కోరారు. వారం రోజుల్లోపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి చక్కెర పరిశ్రమను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొని క్రషింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీ రైతు ఉద్యమం తరహాలో జహీరాబాద్‌లో కూడా ఉద్యమం ప్రారంభం అవుతుందని, దీన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్ రెడ్డి, రైతు నాయకులు జైపాల్ రెడ్డి, రాంచందర్ రాజనర్సింహ, ఆశప్ప, రైతులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాధవ్ రెడ్డి, నర్సింహారెడ్డి రెడ్డి, ఖాసింపూర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ నివేదికలు ఇవ్వండి

- రియల్టర్లకు 'రెరా' చైర్మన్ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ ఆథారిటీ (రెరా) చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ పొందిన రియల్ ఎస్టేట్ ప్రమోటర్లు, బిల్డర్లు సెప్టెంబర్ నెలాఖరులోగా త్రైమాసిక, వార్షిక ఆడిట్ నివేదికల్ని తప్పనిసరిగా సమర్పించాలని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ కోరారు. ప్రాజెక్టు త్రైమాసిక నివేదికను సెక్షన్ 11(1)(బీ) ప్రకారం ప్రమోటర్ లాగిన్ ద్వారా 'రెరా' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. వార్షిక అకౌంట్ ఆడిట్ నివేదికల్ని ఏటా సెక్షన్ 4(2) (ఎల్) (డి) ప్రకారం ప్రొవిజన్ 3 ద్వారా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. త్రైమాసిక నివేదికలు ఏటా ఏప్రిల్ 15, జూలై 15, అక్టోబర్ 15, జనవరి 15 తేదీల్లోపు నివేదించాలని తెలిపారు. దీనికి సంబంధించి బిల్డర్లు, ప్రమోటర్లకు మెసేజ్‌లు, ఈ-మెయిల్స్, నోటీసులు పంపామని వివరించారు. త్రైమాసిక నివేదికల కోసం ఫారం - 4, 5, 6, వార్షిక నివేదికల కోసం ఫారం - 7 వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయనీ, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

12 మందికి 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులు

- అభినందించిన ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్లలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన 12 మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అందజేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో వర్చువల్ పద్ధతిలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ల రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దీనిలో పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వారిలో లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, గేట్ మ్యాన్ సహా వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతల్ని జీఎమ్ అభినందించారు. ఇలాంటి అవార్డులు సంస్థలోని ఉద్యోగులను ప్రేరేపిస్తాయని చెప్పారు. ఎమ్ఎమ్‌టిఎస్ టైమింగ్స్‌పై దృష్టి పెట్టాలని అధికారుల్ని ఆదేశించారు. జోన్ పరిధిలో పునర్నిర్మాణం అవుతున్న రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారుల్ని ఆదేశించారు.

ఎన్నికల ప్రణాళికల్లో మత్స్యకారుల సమస్యలు

- అన్ని రాజకీయ పార్టీలు చేర్చాలి : లెల్లెల బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలపై వచ్చే సాధారణ ఎన్నికల్లో ఆయా పార్టీలు తమ వైఖరి ప్రకటించాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం అధ్యక్షులు గోరెంకల నర్సింహ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే కొందరు భారీ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. వాటి నాణ్యతలో లోపాలున్నాయని తెలిపారు. చేప, రొయ్య పిల్లల కొనుగోలుకు సొసైటీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమచేయాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తిలో ప్రమాదాలకు గురై చనిపోతున్నా వారిని ఆదుకోవడం లేదని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించాలని, వచ్చే నెల 3న మత్స్యకార భవన్‌ను ముట్టడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ శంకర్, ముటా దశరథ్, పగడాల తదితరులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీకి గురవుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

- కనీస వేతనాలూ ఇవ్వని ప్రభుత్వం : చాడ

ధర్నా మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం) స్కీములో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది కనీస వేతనానికి నోచుకోకుండా శ్రమదోపిడీకి గురవుతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు.

హైదరాబాద్ కోఠిలోని డిఎంహెచ్ఎస్ ప్రాంగణంలో రాష్ట్ర ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న ఈ స్కీం ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభు త్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వీరిని ఉద్యోగంలోకి తీసుకోవడం, వేతనాల చెల్లింపు తదితర అంశాలు రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాల్సి ఉన్నప్పటికీ వేతనాల పెంపుదల పట్ల కుంటి సాకులు చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ మాట్లాడారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న వివిధ రకాల ఉద్యోగులకు క్యాడర్ ఫిక్సేషన్ చేయకుండా వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ 24 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన 510 జీవోలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. 13 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డి.హెచ్. గడల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. డిహెచ్ గడల శ్రీనివాసరావు ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల సిబ్బంది వేతనాల పెంపుదల విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, కమిటీ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దాంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్టు యూనియన్ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎం నాయకులు పారిజాతం, స్రవంతి, శ్రీనివాస్ బాబు, రాఘవేంద్ర సామ్, బిన్.అలీ, మధుకర్, డి.బాపు యాదవ్, సాగర్ కమ్రాన్, కన్నెబోయిన రాకేష్, జన్ను కొర్నాల్, పద్మ పాల్గొన్నారు.

రుణాలను రీ షెడ్యూల్ చేయకపోతే
సొసైటీని ముట్టడిస్తాం

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సొసైటీ పరిధిలో ఉన్న నాలుగు వేల మంది రైతులకు ఈ ఏడాది రుణాలు రెగ్యులర్ చేయకపోవడం వల్ల 14 శాతం పడుతున్న వడ్డీ.. రైతులకు భారమని, వెంటనే పాలకవర్గం రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, లేకుంటే ఈ నెల 14న సొసైటీ ఆఫీస్‌ని ముట్టడిస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నరసాపురంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వాలు రైతు రుణాలు మాఫీ చేస్తామంటున్న ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా స్థానిక పాలకవర్గం రైతులకు అదనపు భారాలు మోపే విధంగా చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. ఈ నెల 15వ తేదీ వరకు రుణాలు రీ షెడ్యూల్ చేయకపోతే ఏడు శాతం ఉన్న వడ్డీ రేటు 14 శాతం పెరిగే అవకాశం ఉందని, అలా పెరిగితే రానున్న కాలంలో రైతులపై విపరీతమైన వడ్డీ రేటు పెరిగి అప్పు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే సుమారు రూ.90 లక్షలు.. సొసైటీకి నిధులు వచ్చినప్పటికీ వాటిని మురగపెట్టి రైతులకు రుణాలివ్వకుండా, రుణాలు రీ షెడ్యూల్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అన్ని రకాల రుణాలను తక్షణం రద్దుచేసి కొత్త రుణాలు అందించి రైతాంగాను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షులు గోవింద నాయకులు, వల్లమళ్ల చంద్రరావు, లకావత్ శ్రీను, బానోత్ ఈశ్వర్, సాంబశివరావు, కనికి రత్నం తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతోనే గూని.. వెన్నెముక పెరుగుదల

- ఛత్తీస్‌గఢ్ బాలికకు అసాధారణ సమస్య
- కిమ్స్‌లో శస్త్రచికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలికకు పుట్టుకతోనే విపరీతమైన గూని ఉండడంతో పాటు, వెన్నెముక మీద అసాధారణ పెరుగుదలతో ఆమె వీపు వెనక్కి వంపు తిరిగింది. ఆమెకు అత్యంత సంక్లిష్టమైన విధంగా, వెన్నెముక వంకర వచ్చిందని తెలిసింది. వెన్నెముక సమస్యలను సరిచేయడంలో నిపుణుడైన డాక్టర్ సురేష్ చీకట్ల గురించి బాలిక తల్లిదండ్రులు తెలుసుకుని సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్ సురేష్ చికిత్స వివరాలను తెలిపిన ప్రకారం.. బాలికకు సరైన ఎక్స్‌రేలు, హోల్ స్పైన్ సీటీ స్కాన్, ఎంఆర్ఐ లాంటి పరీక్షలు చేయగా, ఆమెకు కోజెనిటల్ డోర్సల్ కైఫోసిస్ అనే సమస్య ఉందని, దాంతోపాటే వెన్నెముక కూడా పనిచేయడం లేదని తెలిసింది. ఆరు గంటలకు పైగా శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. అప్పటికే బాలికకు రక్తం చాలా తక్కువగా ఉండటం, శస్త్రచికిత్సలో రక్తం బాగా ఎక్కువ పోయే అవకాశం ఉండటంతో సమస్య మరింత తీవ్రంగా ఉంది. 200 నుంచి 300 మిల్లీలీటర్ల రక్తం పోయినా అది ఆమె ప్రాణాలకే ప్రమాదం. తల్లి దండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో, రెండు మూడు సార్లు శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరం లేకుండా ఒకే శస్త్ర చికిత్స చేసి ఖర్చు తగ్గించాలని నిర్ణయించాం. ఈ మొత్తం ఆపరేషన్‌లో డాక్టర్ నరేష్ కుమార్ నేతృత్వంలోని ఎనస్థీషియా బృందం ఎంతో అద్భుతంగా సహకరించింది. ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఆపరేషన్ అయిన మొదటిరోజే బాధితుడిపి నడిపించాం. స్పైనల్ రీహాబిలిటేషన్ బృందం కూడా తమ అద్భుతమైన సేవలు అందించడంతో నాలుగో రోజున ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాం" అని డాక్టర్ సురేష్ తెలిపారు.

26న డాక్ అదాలత్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

పోస్టల్ సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీ వర్చువల్ పద్ధతిలో రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ రంగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాడు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సర్వీసు అంశాలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు ఈ అదాలత్‌లో స్వీకరించబడవని స్పష్టం చేశారు. పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదుల్ని రాతపూర్వకంగా చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలని తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా ఫోన్ నెంబర్ లేదా ఈ-మెయిల్ ఐడీని రాయాలనీ, డాక్ అదాలత్ వర్చువల్ లింక్‌ను దానికి పంపుతామని వివరించారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని, మరింత మెరుగైన పోస్టల్ సేవలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పోస్టల్ సేవలపై అవగాహన సదస్సు

తపాలాశాఖ పొదుపు పథకాలు, బీమా, ఇండియా పోస్ట్ పేమెంట్స్‌బ్యాంక్ అందించే సేవలపై బుధవారం సనత్‌నగర్‌లోని హిందూ మహిళా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ సిటీ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ జనరల్ హెడ్ క్వార్టర్స్ పోస్ట్‌మాస్టర్ టిఎం శ్రీలత, హిందూ మహిళా కళాశాల కార్యదర్శి డాక్టర్ హెచ్ఎమ్ త్రిపాఠి పాల్గొంటారని వివరించారు. ఆసక్తి ఉన్న ప్రజలు ఈ సదస్సులో పాల్గొని, పోస్టల్ సేవల్ని తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండ్రోజుల్లో ఆర్‌టిసి బిల్లుకు ఆమోదం

- జెఎసి నేతలతో గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు రెండ్రోజుల్లో ఆమోదం తెలుపుతానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. ప్రభుత్వం నుంచి ఈ బిల్లు రాజ్‌భవన్‌కు మూడు రోజుల క్రితం వచ్చిందని, తాను రాష్ట్రానికి ఈ రోజే వచ్చినందున పరిశీలన చేసి, ఆమోదిస్తానని తెలిపారు. మంగళవారం రాజ్‌భవన్‌లో టిఎస్ఆర్‌టిసి జెఎసి నేతలు గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ తాను ఆర్‌టిసి కార్మికుల పక్షానే ఉంటానని చెప్పారని, వారికి అన్యాయం జరగొద్దనే ఉద్దేశ్యంతోనే న్యాయసలహా కోసం బిల్లును పంపినట్టు చెప్పారని జెఎసి చైర్మెన్ అశ్వత్థామరెడ్డి తెలిపారు. గతంలో ఆర్‌టిసి విలీన బిల్లును గవర్నర్ ఆమోదించలేదని ప్రచారం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు 25 రోజులకు పైగా తనవద్దే ఎందుకు పెండింగ్‌లో పెట్టుకుందని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశాక, కార్మికులకు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని, వాటన్నింటినీ క్రోడీకరించి 33 సూచనలతో ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చామన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, పరిష్కారాలు సూచిస్తూ బిల్లులో పొందుపర్చాలని కోరారు. గతంలో రాజ్‌భవన్ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేతలు ఇప్పుడు ప్రగతిభవన్ ముట్టడికి ఎందుకు పిలుపు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. ఆర్‌టిసిలోని ఇతర కార్మిక సంఘాలూ జెఎసిలోకి రావాలని, విలీనం తర్వాత ఉత్పన్నమయ్యే పరిస్థితులపై ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జెఎసి కన్వీనర్ కె హన్మంతు, కో కన్వీనర్లు ఎమ్ నరేందర్, పి హరికిషన్, అబ్రహం, సురేష్, శర్మ, శంకర్ ఉన్నారు.

రాజకీయాలపై నాలెడ్జ్ లేని కెటిఆర్

- లిక్కర్ కేసు ఆగిపోయింది
- దమ్ముంటే దానం, తలసానిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయండి
- ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి కేటీఆర్‌కు రాజకీయాలపై నాలెడ్జ్ ఉందనుకున్నా...మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన తర్వాత ఆయనకు ఏమీ తెలియదని నాకు అర్థమైందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ అదరణ కోల్పోయిందనడం సిగ్గు చేటన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెటిఆర్‌కు రాజకీయాలపై అనుభవం లేదన్నారు. బానిసత్వ పార్టీ ఎవరిదో తెలుస్తోందన్నారు. మంత్రి కెటిఆర్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసు ఆగిపోయిందని చెప్పారు. 'మా చెల్లిని అరెస్ట్ చేయకండి. ఎన్నికలు ఎప్పుడైనా పెట్టుకోండి' అంటూ అమిత్‌షాకు కెటిఆర్ చెప్పారని ఆరోపించారు. కెసిఆర్ దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల డిక్లరేషన్ ఏమయింది? దళిత బంధు, బిసి బంధులో అక్రమాలపై కోర్టుకు వెళ్తానన్నారు. కెసిఆర్‌కు దమ్ముంటే ఆయన్ను బండ బూతులు తిట్టిన ఎమ్మెల్యే దానం నాగేందర్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి తెలంగాణ ద్రోహులను తీసేయాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ పాత్ర ఒక శాతం మాత్రమేనన్నారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కెసిఆర్ 115 మంది అభ్యర్థులను ప్రకటించి ఒక్కొక్కరికీ రూ.పది కోట్లు ఇచ్చి పంపించారని ఆయన ఆరోపించారు. మేము తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమం చేస్తున్న సమయంలో కెటిఆర్ అమెరికాలో ఉన్నారని తెలిపారు. చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవడంతోనే కెసిఆర్ బయటకు వచ్చి పార్టీ పెట్టారని గుర్తు చేశారు. తాము తెలంగాణ కోసం కొట్లాడామని తెలిపారు. సోనియాను ఒప్పించి సాధించామన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అసెంబ్లీలో మాట్లాడిన మాటల రికార్డులను కెటిఆర్ వినాలి. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందంటూ కెసిఆరే అన్నారు. సోనియా పాత్ర లేదంటూ కెటిఆర్ అంటున్నాడు. సోనియాపై, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం కెటిఆర్‌కి తగదు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిందో చెప్పాలి. ఎన్నికలు వస్తున్నాయనే పూర్తి కాకుండానే పాలమూరు ప్రాజెక్టు ప్రారంభిస్తున్నారు.' అని విమర్శించారు. దానం నాగేందర్ కట్టె పట్టుకుని తెలంగాణ ఉద్యమకారులను కొట్టారని గుర్తు చేశారు. ఆరేయ్ కేసీఆర్...ఫుట్‌బాల్ లాగా తంతాను అన్న తలసాని.. మంత్రి ఎలా అయ్యాడు?అని నిలదీశారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం ఒక్కసారైనా కెసిఆర్ మాట్లాడాడా? అని ప్రశ్నించారు.

అప్పంపల్లిలో మానని గాయం

- పోలీసులకు ఎదురొడ్డి నిలిచిన గ్రామం
- నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి 11మంది వీరమరణం
- 76 ఏళ్లు దాటినా నేటికీ అందని సహాయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పంపల్లి పొలిమెరలోకి అడుగుపెట్టగానే మాయని గాయమేదో మనస్సుకు తాకుతున్నట్టు అనిపిస్తుంది. ఊరిలోకి పాదం మోపగానే పాత జ్ఞాపకాలు తట్టిలేపుతాయి. అప్పంపల్లి పేరు చూడగానే అమరుల త్యాగాలు గుర్తొస్తాయి. నైజాం రజాకార్ల రాక్షస క్రీడకు సజీవ సాక్ష్యంగా రాగిచెట్టు నేటికీ ఉంది. దొరల గడీలో దొంగచాటుగా ఉండి కాల్పులు జరిగిన ప్రాంతం కిటికీ నేటికీ అద్దం పడుతోంది. రజాకార్లు, నైజాం పోలీసుల రాక్షస క్రీడ గుర్తొస్తే రక్తం సలసల కాగుతుంది. ఈ రాక్షస క్రీడలో 11 మందిని పొట్టన పెట్టుకున్న నేటి దినాన్ని ఏమని జరుపుకోవాలి. ఆ కుటుంబాలు నేటికీ దీనావస్థలో ఉన్నాయి. 76 ఏళ్లు దాటినా వారికి కనీసం వృద్ధాప్య పింఛనైనా రాలేదంటే పాలకుల చిత్త శుద్ధి ఏపాటిదో అర్థం అవుతోంది.

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అప్పంపలి గ్రామంలో అక్టోబరు 7న 11 మందిని నైజాం పోలీసులు, రజాకార్లు పొట్టన పెట్టుకున్నారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చినా తెలంగాణ ప్రాంతం ఇంకా నైజాం నవాబుల చేతులో బందీగా ఉండటాన్ని నిరసిస్తూ.. వీరు అందోళనలు నిర్వహించారు. తెలంగాణకు స్వాతంత్ర్యం కావాలని కర్నూల్ జిల్లా కాల్వ బుగ్గ దగ్గర ఉద్యమకారులకు శిక్షణ ఇచ్చేవారు. అక్కడ శిక్షణ పొందిన వారు అప్పంపల్లి, చింతకుంట, వడ్డెమాను తదితర గ్రామాల్లో ప్రజలను సమీకరించి చైతన్యం చేసేవారు. ఇది పసిగట్టిన నైజాం సర్కార్ పోలీసులు ఉద్యమాలను అణచివేయడానికి అప్పంపల్లి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు పోలీసులను ఎదుర్కోవడానికి కారం పొడి, దుడ్డు కర్రలతో సిద్ధమయ్యారు. దాంతో పోలీసులు గడీలో నుండే గాలిలోకి కాల్పులు జరిపారు. ప్రతిగా అప్పంపల్లి గ్రామ ప్రజలు రాగిచెట్టు దగ్గరకు వచ్చి గడీలో ఉన్న పోలీసులను గడ్డి వేసి కాల్చే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన పోలీసులు ఉద్యమకారులను 11మందిని కాల్చేశారు. చనిపోయిన వారిలో తంగెడి రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, చాకలి కుర్మన్న, పోతురాజు ఈశ్వరయ్య, కటికె నాన్నెమ్మ, హరిజన తిమ్మన్న, గొల్ల గజ్జలన్న, వడ్డెమాను నర్సన్న, కుర్వసాయన్న ఉన్నారు. వీరితోపాటు 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అయినా.. గ్రామస్తులు బెదరకుండా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెల్లం నాగన్న, నెల్లికొండి కిష్టారెడ్డిని పోలీసులకు చిక్కకుండా ఇతర ప్రాంతానికి తరలించారు.

కటిక దారిద్ర్యంలో అమరుల కుటుంబాలు

ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నాయి. తంగెడి రాంరెడ్డి, అతని తండ్రి లక్ష్మారెడ్డి ఇరువురూ ఉద్యమంలో నేలకొరిగారు. రాంరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం కొంత పోరంబోకు భూమినిచ్చింది. తర్వాత వివిధ కారణాల పేరుతో తిరిగి తీసుకుంది. బెల్లం నాగన్నకు ఏడుగురు కుమారులు ఉన్నారు. ఒక కూతురు ఉంది. వీరు కటిక దరిద్రం అనభవిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వీరికి ఎటువంటి సహాయం అందలేదు. ముఖ్యంగా మూడో కుమారుడు బెల్లం ఆంజనేయులు తిండి గింజలు లేని దయనీయ స్థితి ఉంది. 65ఏళ్లు దాటినా పింఛను రావడం లేదు. కటికె నన్నెమ్మ అల్లునికి సెంటు భూమి లేదు. కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. హరిజన్ కిష్టన్న, వడ్డెమాన్ నర్సన్న కుర్వ సాయన్న, పోతురాజు ఈశ్వరయ్య, చాకలి కుర్మన్నల కుటుంబాలు దయనీయంగా ఉన్నాయి. ప్రభుత్వ సహాయం కోసం వీరు ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం మాకు ఇచ్చిందేమీ లేదు.
బెల్లం ఆంజనేయులు, అప్పంపల్లి, సీసీ కుంట- మహబూబ్‌నగర్ జిల్లా

ఉద్యమంలో మా కుటుంబం పాల్గొంది. ఆర్థికంగా చితికిపోయాం. మా నాన్న జైలుపాలు అయ్యాడు. మానాన్నను చంపాలని అనేక సార్లు ఊర్లో కాపలా పెట్టారు. గ్రామస్తులే ఆయన్ను కాపాడుకున్నారు. ఉన్న భూమి మొత్తం అమ్మి కేసుల చుట్టూ తిరిగాడు. ఇప్పుడు కనీసం తిండికి

కూడా ఇబ్బంది ఉంది. నాకు 65 ఏళ్లు దాటినా పింఛను ఇవ్వడం లేదు.

మా అత్తమ్మను చంపారు..
మహిమూద్ అలీ, అప్పంపూర్, సిసి కుంట, మహబూబ్‌నగర్ జిల్లా

మా అత్తమ్మ ఉద్యమంలో పోలీసుల తూటాలకు బలి అయింది. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. మాకు కనీసం నిల్వ నీడ లేదు. సాగు భూమి లేదు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వారికి అన్ని సమకూరుస్తూ.. తెలంగాణకు స్వాతంత్ర్యం కోసం పోరాడిన మాపై ఎందుకు వివక్ష చూపుతున్నారు.

అప్పంపల్లి బాధితులను ఆదుకోవాలి
గుముడాల చక్రివర్తి గౌడ్, ఉపాధ్యాయుడు, అప్పంపల్లి

తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరిచిపోతున్నాయి. ప్రాణ త్యాగాలు చేసిన వారి కుటుంబాలు నేడు వీధిన పడ్డాయి. సంబరాలు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వాములు అయిన వారిని అమరుల కుటుంబాలను ఆదుకోవాలి.

రక్తమోడిన రాజీవ్ రహదారి

- ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిద్ర మత్తులో కారు డ్రైవర్ రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. ఎనిమిది మందికి గాయలవ్వగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో పరీక్ష రాసేందుకు కారులో (తుఫాను) వెళ్లి తిరిగి సిద్దిపేటకు బయలుదేరారు. నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్.. అతి వేగంతో ఇసుక లోడుతో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. కారు ముందు సీటులో కూర్చున్న వారు లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోవడంతో ప్రమాద స్థలంలోనే ముగ్గురు విద్యార్థులు నితిన్, గ్రీష్మ, నమ్రత మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కారులో మొత్తం 11మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నట్టు ప్రాథమిక సమాచారం. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్థిక ఇబ్బందులతో ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కెసిఆర్ కాలనీలో మంగళవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కెసిఆర్ కాలనీకి చెందిన అంబటి శ్రీధర్(24) టెక్స్‌టైల్ పార్కులో పనిచేస్తున్నారు. కొంతకాలంగా మరమగ్గాలతో చేతినిండా పనిలేకపోవడంతో మూడు నెలల కిందట సిరిసిల్ల పట్టణంలో ఒక హోటల్‌ను అద్దెకు తీసుకొని టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. ఒక పూట టిఫిన్ సెంటర్, మరో పూట నేత కార్మికుడిగా పనిచేసేవారు. తల్లితోపాటు టిఫిన్ సెంటర్‌కు వెళ్లిన శ్రీధర్ బ్యాంకులో పని ఉందని మధ్యాహ్నం తల్లిని సిరిసిల్లలో చెల్లెలు ఇంట్లో వదిలి వెళ్లారు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో శ్రీధర్ చెల్లెలు కెసిఆర్ కాలనీలోని వారి ఇంటి పొరుగువారికి ఫోన్ చేసింది. వారు ఇంటికి వెళ్లి చూడగా శ్రీధర్ ఉరేసుకుని కనిపించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ప్రాణం తీసుకున్నట్టు కుటుంబీకులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.